క్లుప్తంగా

నామమాత్రంగా మండల మీట్

ఏర్పేడు: ఎంపీడీఓ కార్యాలయ సమావేశమందిరంలో మంగళవారం ఎంపీపీ గీత ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో ఎలాంటి తీర్మానాలు లేకుండా ప్రారంభమైన కాసేపటికే ముగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు తిరుపతి జనార్ధన్‌రెడ్డి, జమళ్ల శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ గిడ్డయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



వైఎస్సార్ బీమా అందజేస్తున్న సర్పంచ్

సత్యవేడు: మండలంలోని రాచపాళెం పంచాయతీలో నివసిస్తున్న ఎం.కుమార్(36) అనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం సర్పంచ్ రూబెన్, ఎంపీడీఓ బాల గణేశన్, సెక్రటరీ శైలజ కలసి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం రూ.10 వేలు అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ రమేష్, వలంటీర్ పార్తీబన్ తదితరులు పాల్గొన్నారు.

15 మంది బైండోవర్



బైండోవర్ చేసిన వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకుంటున్న డీటీ శివయ్య

బుచ్చినాయుడుకండ్రిగ : ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు తావులేకుండా ముందస్తుగా 15 మందిని ఎస్‌ఐ మంజునాథరెడ్డి బైండోవర్ చేశారు. వీరిని డిప్యూటీ తహసీల్దారు శివయ్య ఎదుట హాజరు పరిచారు. ఎన్నికల్లో ఎలాంటి గొడవలు చేయమని బైండోవర్ అయిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు తెలిపారు. దీంతో వీరి వద్ద నుంచి స్టేట్‌మెంట్ తీసుకుని వదిలేశారు.

నేడు సమావేశం

సత్యవేడు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ బలపరిచిన పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డికి మద్దతుగా నిర్వహిస్తున్న సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి కోరారు. బుధవారం సత్యవేడు బేరిశెట్టి కల్యాణ మండపంలో మధ్యాహ్నం 3గంటలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమానికి పట్టభద్రులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

భూపంపిణీకి సర్వే చేయండి



మాట్లాడుతున్న డీఐఎస్ రవిశేఖర్

బుచ్చినాయుడుకండ్రిగ: త్వరలో జరగనున్న అసైన్‌మెంట్ భూముల పట్టాల పంపిణీ కోసం అనాధీనం భూములను త్వరితగతిన సర్వే చేయాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టరు ఆఫ్ సర్వేయరు రవిశేఖర్ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అసైన్‌మెంట్ భూముల పంపిణీ, భూ రీసర్వేపై వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాధీనం భూములను గుర్తించి, అర్హులైన వారికి అసైన్‌మెంట్ భూముల పట్టాలను త్వరలో పంపిణీ చేస్తామన్నారు. ఇందుకోసం వీఆర్‌ఓలు, సర్వేయర్ల అనాధీనం భూములను సర్వే చేసి, రికార్డులను సిద్ధం చేయాలని తెలిపారు. అదేవిధంగా త్వరలోనే మండలంలో భూసర్వే కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీటీ శివయ్య, ఆర్‌ఐ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న వక్తలు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఎంఏ తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఎస్వీయూలోని ఎంబీఏ భవనంలో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్టేట్ ట్యాక్స్ అండ్ అప్పిలేట్ అథారిటీ అదనపు కమిషనర్ బాలాజీ బాబు హాజరయ్యారు. జీఎస్టీ నిర్మాణాన్ని అర్థం చేసుకోవడం, సకాలంలో రిటర్న్‌లు దాఖలు చేయడం, జీఎస్టీ నియమాలు, నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూడడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్వీయూ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగపు ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పరోక్ష పన్నుల విధానాల్లో మార్పులు స్టాక్ మార్కెట్‌ను ఎలా ప్రభావితం చేస్తాయన్న అంశాల గురించి వివరించారు. సీఎంఏ తిరుపతి చాప్టర్ చైర్మన్ రమేష్ దామర్ల, వైస్ చైర్మన్ పార్థసారథి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగనన్న లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి
- గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే బియ్యపు మధు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



సమావేశానికి హాజరైన గృహసారథులు

శ్రీకాళహస్తి రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో నిరుపేదలు పొందుతున్న మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత గృహసారథులపైనే ఉందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీకాళహస్తి మండలం గృహసారథుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 18 నుంచి నిర్వహించనున్న ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల స్టిక్కర్లను వారి ఇంటి తలుపులకు అంటించి వారి అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. అదేవిధంగా గత టీడీపీ పాలనలో వివిధ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులు ఎలా జేబులు నింపుకున్నారో, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అబ్దిదారుని ఇంటికే వలంటీర్లు అందజేస్తున్న తీరును ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి 25 ఇళ్లకు ఒక గృహ సారథిని నియమించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో గృహ సారథులకు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయని, ఈ ఏడాది కష్టపడితే మళ్లీ మన ప్రభుత్వం వచ్చాక అందరి తలరాతలు మారుతాయన్నారు. రెండు సంవత్సరాల కాల వ్యవధిలోనే అనేక అభివృద్ధి పనులు చేశామని వాటిని చదివి గృహసారథులకు వినిపించారు. అనంతరం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడంపై స్టేజీ మీద నాయకులతో కలసి కేక్ కట్ చేశారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో మహిళలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వయ్యాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఏపీబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగల్ బాలాజీప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ గోవిందరెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్‌యాదవ్, మండల యువత కన్వీనర్ వెంపల్ల సురేంద్రయాదవ్, మునిరత్నంరెడ్డి, గోపీగౌడ్, అంకయ్య, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్మక్రియలకు సాయం అందజేత

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని మేలచ్చూరు ఎస్టీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొండా మారయ్య(53) ఫిబ్రవరి 25న మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం ఆయన మారయ్య కుటుంబసభ్యులను తన కార్యాలయానికి పిలిపించి కర్మక్రియలకు రూ.10 వేలు సాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఉబ్బర మనోహర్ మృతుని కుటుంబానికి అందజేశారు.

ట్రైసైకిల్ అందజేత



దివ్యాంగునికి ట్రైసైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం రేణిగుంట మండలం మల్లెమడుగు ఎస్టీకాలనీకి చెందిన పులిగోటి గణేశ్‌కు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ట్రైసైకిల్‌ను అందజేశారు. అదేవిధంగా తొట్టంబేడు మండలం శివనాథపురానికి చెందిన మేస్త్రీ బాలకృష్ణకు నెలసరి మందులకు ఇబ్బంది పడుతుండడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన తన కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి ద్వారా రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మనోహర్, సురేంద్రయాదవ్, నరేష్‌రెడ్డి, మల్లి మొదలియార్, రాము, మునిరత్నంరెడ్డి, ప్రసాద్ నాయుడుత తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు జడ్జి



గురుదక్షిణామూర్తి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిథాల్

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిథాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. ముందుగా న్యాయమూర్తి రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక న్యాయస్థాన సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కృష్ణప్రియ, ఆలయ అధికారులు మల్లికార్జున ప్రసాద్, నాగభూషణంయాదవ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటి, పర్వతరెడ్డికి మద్దతుగా ప్రచారం



బీఎన్‌కండ్రిగలో ప్రచారం చేస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మండల కన్వీనరు అరణి విద్యానాథరెడ్డి కోరారు. ఆయన స్థానిక నాయకులతో కలిసి మంగళవారం బుచ్చినాయుడు కండ్రిగ, కనమనంబేడు గ్రామాలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల వద్దకు వెళ్లి తొలి ప్రాధాన్యత ఓటు పేర్నాటికి వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, సురుటుపల్లి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని తంగెళ్లపాళెం క్రాస్ వద్ద మంగళవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు. వివరాలు.. మండలంలోని పల్లమాల నుంచి పనబాకకు ఆటోలో తరలిస్తున్న 500 కేజీల బియ్యంతో పాటు ఆటోను, డ్రైవర్ వెంబుని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నారాయణవనం పీహెచ్‌సీకి జాతీయ గుర్తింపు



ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్‌తో డాక్టర్లు, వైద్య సిబ్బంది

నారాయణవనం: మండలకేంద్రం నారాయణవనం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేంద్ర ఆరోగ్య, సంక్షేమ శాఖ జాతీయ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) అవార్డు వచ్చింది. సోమవారం జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ దర్శిత్‌రాజు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ 2021 ఆగస్టులో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ బృందం సందర్శించినట్లు చెప్పారు. పీహెచ్‌సీలో సాధారణ పాలన, అవుట్ పేషెంట్స్ సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ల్యాబ్ నిర్వహణ, ప్రసూతి సౌకర్యాలు తదితర ఆరు అంశాలకు సంబంధించిన రికార్డులను బృందం పరిశీలించిందన్నారు. ఈ సేవలను ప్రామాణికంగా తీసుకుని తిరుపతి జిల్లాలో నారాయణవనం, పాపానాయుడుపేట, బుచ్చినాయుడుకండ్రిగ, పిచ్చాటూరు, బాలిపల్లి, చెన్నూరు, భాకరాపేట ప్రాథమిక కేంద్రాలకు జాతీయ స్థాయిలో ఎన్‌క్యూఏఎస్ అవార్డుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఎంపిక చేసిందని దర్శిత్‌రాజ్ తెలిపారు. జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడంతో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. డాక్టర్ రాగసుధ, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ బాబు, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్ బాబు, స్టాఫ్‌నర్సులు సుభాషిణి, దేవీభారతి, అరుణ, వరలక్ష్మిలను ఈ సందర్భంగా దర్శిత్‌రాజ్ అభినందించారు.

వేడుకగా అగ్నిగుండ మహోత్సవం



ఉత్సవాల్లో పాల్గొన్న పవిత్రరెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని చేమూరులో పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం శ్రీపాండురంగ అగ్నిగుండ మహోత్సవం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో కంకణాలు కట్టుకుని భజనలు చేసి అగ్నిగుండంలో దిగి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కుమార్తె, మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రా రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గంగరామిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, గురువారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శేఖర్‌రెడ్డి, కృష్ణయ్య, చలపతి గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పిచ్చాటూరులో జనావాసాల్లోకి కృష్ణజింక



వెంకట రెడ్డి కండ్రిగ వద్ద జింకను అడవిలో వదిలి పెడుతున్న అటవీశాఖ అధికారులు

పిచ్చాటూరు: మండల కేంద్రమైన పిచ్చాటూరు బస్టాండు సమీపంలో ఉదయం 8 గంటలకు ఓ కృష్ణ జింక ప్రత్యక్షమైంది. ఈ మేరకు వీధి కుక్కలు కృష్ణ జింకపై దాడికి యత్నించాయి. వాటి నుంచి తప్పించుకోవడానికి తోపు వీధిలోని ఓ ఫెన్సింగ్‌లోకి దూరి జింక చిక్కుకుంది. స్థానికులు గుర్తించి జింకను బయటకు తీసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఫెన్సింగ్‌లో దూరి జింక ముఖానికి గాయాలయ్యాయి. పశువైద్యాధికారులు డాక్టర్ ఇందిర, డాక్టర్ ధనంజయులు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని జింకకు వైద్యం చేశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న అటవీశాఖ ఎఫ్‌బీఓ చిత్ర, ఏబీఓ శ్రీనివాసులు స్థానిక సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి సమక్షంలో చికిత్స అనంతరం జింకను స్వాధీనం చేసుకుని వెంకటరెడ్డి కండ్రిగ అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బయోగ్రఫీ ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి కల్చరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్, జూనియర్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బయోగ్రఫీని మంగళవారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేకాం చైర్మన్ నామా రాజేష్‌కుమార్, జేసీఐ తిరుపతి అధ్యక్షుడు గుణశేఖర్, కార్యదర్శి జయలక్ష్మి తేజ, ఒడిసి అధ్యక్షులు గౌతమి, సభ్యులు లావణ్య, డాక్టర్ రఘురాములు, వరలక్ష్మి, ప్రవీణ్, హరి, స్వప్న పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కార్వేటినగరం: మండలంలోని సురేంద్రనగరంలో ఉన్న వరద వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం సామూహిక కుంకుమార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ జయంతి, లక్ష్మీ కుంకుమార్చన నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆలయంలో వరద వేంకటేశ్వరస్వామి మూల విరాట్‌కు అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఉమ్మడి చిత్తూరు జిల్లా వారి సంయుక్త ఆధ్వర్యంలో కుంకుమార్చన చేశారు. ముందుగా విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి, మధ్యాహ్నం లక్ష్మీ సహస్రనామ చేశారు. అలాగే శాత్తుమొర, చతుర్వేద పారాయణం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసకళ్యాణ్, పుత్తూరు, నగిరి బ్రాహ్మణ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 14 నుంచి ‘మోదీ హటావో దేశ్ బచావో’ యాత్ర

తిరుపతి కల్చరల్: అదానీ కంపెనీ వ్యవహారాలపై జాయింట్ పార్లమెంట్ కమిటీ విచారణ చేపట్టాలని, వివరాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 14 నుంచి మే ఒకటి వరకు చేపట్టిన మోదీ హటావో దేశ్ బచావో అనే నినాదంతో దేశవ్యాప్తంగా పాదయాత్రలు చేపడతామన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి పెద్దపీట



నారాయణవనంలో ఎమ్మెల్సీ ప్రచారంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం: దార్శనికత ఉన్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అద్భుతమైన సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధిస్తోందని, తద్వారా మన రాష్ట్రానికి పారిశ్రామికంగా గుర్తింపు వస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. దీంతో రాష్ట్రం పారిశ్రామిక పెట్టుబడులకు కేంద్రంగా మారుతోందని తెలిపారు. విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా ముగిసి 352 ఓఎంయూలు కుదుర్చుకుని రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తుండడంపై సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు విజయోత్సవ సంబరాలను జరుపుకున్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం జగనన్న ప్రముఖ పారిశ్రామిక దిగ్గజాలైన రిలయన్స్, అదానీ, టాటా తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొనడమే గొప్ప విజయమన్నారు. రూ.13,05,663 కోట్ల పెట్టుబడులతో 6 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బాబు, వైస్ ఎంపీపీ శివశంకర్, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, పార్టీ నాయకులు ఏకాంబరం, అన్నాదొరై, గురుస్వామి, చిన్నదొరై, శంకరయ్య, మోహన్, సర్పంచ్‌లు సాయిరవి, ధర్మలింగం, సుబ్రమణ్యం రెడ్డి, మురుగేశం, పార్టీ శ్రేణులు గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి..

నారాయణవనం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నాలుగేళ్ల జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని బలపరస్తూ మేధావులు, ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం సాయంత్రం నారాయణవనంలో గ్రాడ్యుయేట్లను, ఉపాధ్యాయులను కలిసి ఎన్నికల కరపత్రాలను అందజేశారు.

ఎన్నికలు వస్తే టీడీపీ డ్రామాలు స్టార్ట్



మాట్లాడుతున్న గవర్ల కృష్ణయ్య, పార్టీ శ్రేణులు

కేవీబీపురం: ఏ ఎన్నికలు వచ్చినా టీడీపీ డ్రామాలు మొదలవుతాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గవర్లకృష్ణయ్య ఆరోపించారు. ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ మునెమ్మతో కలిసి మంగళవారం స్థానిక పార్టీ మండల కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆదివారం రాగిగుంట గ్రామంలో ఇద్దరి యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరూ గాయపడ్డారని, కానీ టీడీపీ నేత డిల్లీబాబుకు మద్దతుగా ఆ పార్టీ నేతలు రాగిగుంట కూడలిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. యువకుల మధ్య తలెత్తిన వివాదానికి టీడీపీ నేతలు రాజకీయరంగు పులిమి, కుల రాజకీయాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వంపై నోటికొచ్చినట్లు ఆరోపణలు చేసిన టీడీపీ తిరుపతి మాజీ తుడా చైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే హేమలత, హెలెన్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు నందకుమార్, పట్టాభిరెడ్డి, మాధవరెడ్డి, మూర్తి, సుబ్బన్న, గోపాల్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా భగవాన్ జన్మదిన వేడుకలు



ప్రత్యేక ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లంలో గల ఏకం క్షేత్రంలో కల్కి భగవాన్ 74వ జన్మదిన వేడుకలను ఆశ్రమ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం భగవాన్ తనయుడు కృష్ణాజీ చేతుల మీదుగా కేక్‌ను కోసి భక్తులకు, పంచిపెట్టారు. అనంతరం వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, నెల్లూరు జిల్లాలోని తడ, సూళ్లూరుపేట మండలాలకు చెందిన 116 మంది ప్రత్యేక ప్రతిభావంతులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్, వాకర్స్, స్టిక్స్, బ్లైండ్ స్టిక్స్, చెవిటి మిషన్లు వంటి పరికరాలను వితరణగా భగవాన్ తనయుడు కృష్ణాజీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీసిటీ డీఎస్పీ జగదీష్‌నాయక్, సీఐలు శ్రీనివాసులు, శివకుమార్‌రెడ్డి, ఎస్‌ఐలు నాగార్జున రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, హనుమంతప్పలు హాజరయ్యారు. లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ, జనరల్ మేనేజర్ సునీల్ దాసాజీ, ప్రతినిధి ఉమాపతి దాసాజీలు పాల్గొన్నారు.

పేర్నాటి గెలుపునకు కృషి చేయండి



ఓళ్లూరులో ఎన్నికల ప్రచారంలో పార్టీ శ్రేణులు



నాగలాపురంలో..

కేవీబీపురం: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ వెంకట నారాయణ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలోని ముదిరాజ్ సంఘానికి చెందిన పట్టభద్రుల ఓటర్లతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తేరణి ధనుంజయరెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా శ్యామ్ ప్రసాద్‌రెడ్డి బ్యాలెట్ నమూనా, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఎంపీటీసీ మోహన్‌నాయుడు, ప్రేమ్ కుమార్, ఖాదర్‌బాషా, బాబు, మణి పాల్గొన్నారు.

నాగలాపురంలో..

పిచ్చాటూరు: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి మద్దతుగా పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్లు అపరంజి రాజు, కేటీ హరిశ్చంద్రా రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలి, తొప్పయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు చిన్నదొరై, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేవీబీపురంలో..

కేవీబీపురం: మండలవ్యాప్తంగా గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలుపును కాంక్షిస్తూ ప్రచారం చేశారు. ప్రతి పట్టభద్రుల ఓటర్లను కలిసి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి బ్యాలెట్ నమూనాను పరిచయం చేస్తున్నారు. ఓళ్లూరు, పాతపాళెం, రాయపేడు, వగత్తూరు గ్రామాల్లో మంగళవారం పార్టీ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం చేశారు.

శాస్త్రోక్తం.. మహా చండీహోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి



ప్రత్యేకాలంకరణలో గంగమ్మ

తిరుపతి కల్చరల్ : హోలీ పండుగను పురస్కరించుకుని మంగళవారం తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శాస్త్రోక్తంగా మహా చండీహోమం నిర్వహించారు. ఉదయం 8.30 నుంచి ఆరంభమైన హోమపూజల్లో 51 మంది దంపతులు పాల్గొన్నారు. నగర మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, తుడా కార్యదర్శి లక్ష్మీ ముఖ్యఅతిథులుగా హాజరై అమ్మవారిని సేవించుకున్నారు. 11.45 గంటలకు మహాపూర్ణాహుతితో హోమం ముగిసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ ఎం.మునికృష్ణయ్య, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం రామారావు, జేసీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, ఆలయ కమిటీ సభ్యులు ఎం.హరినాథ్‌రెడ్డి పి.ధనశేఖర్, వి.కృష్ణయ్య, ఎస్.భారతి పాల్గొన్నారు.